సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం ၊ 30 ၊ మార్చి ၊ 2023



అప్పన్నకు పట్టువస్త్రాలు
శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తులు పట్టువస్త్రాలను అందజేశారు.
10లో



కటాఫ్ తేదీ ప్రామాణికంగా ...
కటాఫ్ తేదీ ప్రామాణికంగా పోలవరం పరిహారం వర్తిస్తుందని చింతూరు ఎంపీడీవో రవిబాబు అన్నారు.
10లో



సుందర నగరం విశాఖ
అత్యంత సుందర నగరాల్లో ఒకటిగా విశాఖ నిలుస్తుందని కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు అన్నారు.
10లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (గురు) 6-10 | సహర్ (శుక్ర) 4-38

రంపచోడవరం :
ఇఫ్తార్ (గురు) 6-25 | సహర్ (శుక్ర) 4-40

తనువంతా కనులై..



సుందరసీతారామచంద్ర స్వామివారి ఆలయ మార్గం, (ఇన్‌సెట్) సీతారాముల విగ్రహాలు

- రాములోరి పెళ్లిని తిలకించేందుకు భక్తుల ఎదురుచూపు
- నేడు ఏజెన్సీ భద్రాద్రి శ్రీరామగిరిలో కళ్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

చలువ పందిళ్లు...మామిడాకుల తోరణాలు.. విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన ఏజెన్సీ భద్రాద్రి శ్రీరామగిరి కల్యాణశోభతో కాంతులీనుతోంది. రాములోరి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. మరోవైపు కనులారా సీతారాముల కల్యాణం వీక్షించేందుకు భక్తులు తనువంతా కనులై.. ఎదురు చూస్తున్నారు.

వీఆర్‌పురం: సీతారాముల కల్యాణానికి శ్రీరామగిరిలోని కొండమీద శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి ఆలయం ముస్తాబయింది. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ఏలూరు, అల్లూరి జిల్లాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఏజెన్సీ భద్రాద్రిగా ఈ ఆలయం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆలయానికి సమీపంలోని గ్రామాలన్నీ రామాయణ ఘట్టాలతో ముడిపడి ఉన్నాయనడానికి ఆధారాలున్నాయని స్థానికులు చెబుతున్నారు. రామయ్య కల్యాణాన్ని వైభవంగా జరిపించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయానికి రంగులు వేసి అందంగా తీర్చి దిద్దడంతో పాటు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. హోమగుండం,కల్యాణ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దేశంలోనే దక్షిణా పథ ముఖం కలిగిన దివ్య పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఈ ఆలయానికి పరిసర ప్రాంతాల్లో కూడా రామాయణ కాలం నాటి ఆనవాళ్లు ఎన్నో దర్శనమిస్తాయి. ఇక్కడ తలంబ్రాల కార్యక్రమం ముగిసిన పిదపనే భద్రాచలంలోని భద్రగిరి రామునికి తలంబ్రాలు పోశేవారని, క్రమేపి ఆ విధానంలో మార్పు చోటు చేసుకుందని ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు,చైర్మన్ రేవు బాలరాజు తెలిపారు.

ఆలయ విశిష్టత
సుమారు 500 ఏళ్ల క్రితం మాతంగి మహర్షి ఈ ఆలయాన్ని ప్రతిష్టించినట్టు తెలుస్తోంది. దండకారణ్యంలో సీతాదేవి అపహరణకు గురికాగా ఆమె జాడ కోసం వెదుకుతూ వచ్చిన శ్రీరాముడు ఈ కొండపై దక్షిణ దిక్కుగా కూర్చుని తపస్సు చేశారని, అందువల్లే ఆలయ ముఖద్వారం దక్షిణ దిక్కుగా ఉంటుందని అర్చకులు తెలిపారు. శ్రీరామగిరికి సమీపంలో వాలిసుగ్రీవుల గుట్టలు ఉన్నాయి.అంతేకాక మాయ లేడిగా మారిన మారీచుని కొట్టిన ప్రదేశం ప్రస్తుతం చొక్కనపల్లి గ్రామమని, అందుకు ఆధారం గోదావరి నదిలో బండపై లేడి ఆకారం, రాముని పాదాలు స్పష్టంగా దర్శనమివ్వడమేనని ఇక్కడి వారు చెబుతున్నారు. వృద్ధ జటాయువు రావణాసురుడిని ఎదిరించి పోరాడే క్రమంలో రెక్క తెగిపడిన ప్రాంతాన్ని రెక్కపల్లిగా ఈ ప్రాంతవాసులు విశ్వసిస్తారు. నాటి రెక్కపల్లి నేడు రేఖపల్లిగా పిలువబడుతోంది.




కొండ కింద కల్యాణ మండపం చుట్టూ వేసిన చలువ పందిళ్లు

జటాయువు మండపం సిద్ధం

- ఉష్ణగుండాలలో వేడినీళ్ల బావి రడీ



ఎటపాకలోని జటాయువు మండపంలో విగ్రహాలు



ఉష్ణగుండాల గోదావరి నదిలో వేడినీళ్ల బావి(ఫైల్)

ఎటపాక: భద్రాద్రిలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తుల సందర్శనార్థం తెలంగాణ సరిహద్దున ఉన్న అల్లూరి జిల్లా ఎటపాక మండలంలోని జటాయువు మండపం, గుండాల గ్రామంలోని ఉష్ణగుండాల గోదావరి నదిలో వేడినీళ్ల బావిని సిద్ధం చేశారు. ఏటా భద్రాద్రిలో జరిగే శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం,ముక్కోటి పర్వదినాల్లో వేలాది మంది భక్తులు జటాయువు మండపం,ఉష్ణగుండాలను దర్శించుకుంటారు.

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఏర్పాటు



డీసీఈబీ జిల్లా యూనిట్ చైర్మన్,ఇతర కార్యవర్గం

సాక్షి, పాడేరు: విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డును బుధవారం ఏర్పాటు చేశారు. డీసీఈబీ బోర్డు చైర్మన్‌గా డీఈవో సలీమ్ బాషా, వైస్ చైర్మన్‌గా అదనపు డీఈవో, కార్యదర్శిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాల హెచ్ఎం జి.వి.వి.ప్రసాద్, సభ్యులుగా ఎస్.సుందరరావు(అరకుహెచ్ఎం), ఆర్.ధర్మన్న(లోచలిపుట్టు హెచ్ఎం), కె.మల్లమ్మ (రంప చోడవరం హెచ్ఎం),టి.లక్ష్మయ్య(చింతూరు హెచ్ఎం),జి.పుష్పవతి(జోలాపుట్టు హెచ్ఎం),ఎస్.పూర్ణచంద్రరావు(అరడకోట హెచ్ఎం), సీహెచ్.ప్రభాకర్(పాడేరు ఏకలవ్య పాఠశాల హెచ్ఎం),పి.చంద్రకళ(పాడేరు కేజీబీవీ ఎస్‌వో)లు ఎంపికయ్యారు.

చింతపల్లిలో భారీ వర్షం



వైర్లపై పడిన చెట్టు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో బుధవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి, వర్షం కారణంగా సంతబయలు వద్ద ఓ చెట్టు కూలి సంతలో దుకాణాల మధ్య పడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మరో ప్రాంతంలో చెట్టు కొమ్మలు విరిగి వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. వారపు సంతలో వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.

న్యూస్‌రీల్

పాపికొండల పర్యాటకానికి బ్రేక్



పోచవరం బోట్ పాయింట్ వద్ద నిలిచిపోయిన పర్యాటక బోట్లు

వీఆర్‌పురం: మండలంలోని పోచవరం బోట్ పాయింట్ నుంచి పాపికొండలకు వెళ్లే పర్యాటక బోట్లను నిలిపివేయాలని చింతూరు ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో సూరజ్‌గనోరే ఆదేశాలు జారీ చేసినట్టు తహసీల్దార్ ఎన్.శ్రీధర్ బుధవారం తెలిపారు. మంగళవారం పీవో బోట్ పాయింట్ వద్ద ఆకస్మికంగా తనిఖీ చేశారని ఆయన చెప్పారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నిబంధనలు పాటించడంలో అక్కడ నిర్వాహకులు అలసత్వంగా వ్యవహరించడాన్ని పీవో గుర్తించి, బోటింగ్‌ను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారన్నారు.

1న ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత వైద్యశిబిరం

సాక్షి, పాడేరు: ప్రభుత్వ ఉద్యోగుల కోసం స్థానిక కలెక్టరేట్‌లో వచ్చేనెల 1వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం గాయత్రీ విద్యాపరిషత్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో గాయత్రీ వైద్యకళాశాలకు చెందిన పలు విభాగాల వైద్యనిపుణులు పాల్గొంటారని తెలిపారు. అన్నిశాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

టేకు దుంగల వ్యాన్ సీజ్



స్వాధీనం చేసుకున్న కలప

దేవీపట్నం: అక్రమంగా టేకు దుంగలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్టు ఇందుకూరు అటవీక్షేత్రాధికారి వి.దుర్గాకుమార్ బాబు తెలిపారు. దేవీపట్నం సెక్షన్ వీరవరం సమీపంలో మంగళవారం రాత్రి 24 టేకు దుంగలను తరలిస్తున్న మినీ వ్యాన్‌ను నైట్ పెట్రోలింగ్‌లో పట్టుకున్నారు. ఈ దుంగలను పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామమైన ఏనుగులగూడెం నుంచి మంటూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలిస్తుండగా పట్టుకున్నట్టు దుర్గాకుమార్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.85 వేలు ఉంటుందన్నారు. కలపతో వాహనాన్ని గోకవరం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్టు చెప్పారు. ఈ దాడిలో రేంజ్ అధికారితో పాటు దేవీపట్నం సెక్షన్ అధికారి ఎస్. కృష్ణ సిబ్బంది బి.రాజశేఖర్, ఎం.శ్రీనివాసుదొర, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

విజయవంతంగా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్



గర్భిణికి రక్తం ఎక్కిస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్(రక్తం ఎక్కించే) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పీహెచ్‌సీ పరిధిలో రక్త హీనత ఉన్న ఇద్దరు మహిళలకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమి, వైద్యాధికారులు రాహుల్, చైతన్యల ఆధ్వర్యంలో బుధవారం బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేశారు. ఇప్పటి వరకు గర్భిణులకు, ఇతర రోగులకు రక్తం ఎక్కించాలంటే కాకినాడ, రాజమహేంద్రవరం ఆస్పత్రులకు తీసుకు వెళ్లవలసివచ్చేది. వై.రామవరం సీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసి, రక్తం ఎక్కించే కార్యక్రమాలను చేపడుతున్నారు.

నలుగురు ఎంపీడీవోలు, డీఈకి
షోకాజ్ నోటీసులు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : ముందస్తు అనుమతి లేకుండా మండల కేంద్రాలను విడిచి వెళ్లిన, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాని పాడేరు, ముంచంగిపుట్టు, అరకులోయ, జి.మాడుగుల మండలాల ఎంపీడీవోలకు, రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా చింతపల్లి ఆర్‌అండ్‌బీ డీఈకి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ నోటీసులు జారీ చేశారు. బుధవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయం నుంచి ఆయన ఏజెన్సీ 11 మండలాల ఎంపీడీవోలు, మండల ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధి పథకం, గృహ నిర్మాణ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో అధికారులు పాల్గొనకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడైన తాగునీటి పథకాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ వేతనదారులకు ఆధార్ సీడింగ్, ఆధార్ అథంటికేషన్ చేయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మన బడి నాడు–నేడు పనులకు ప్రభుత్వం విడుదల చేసిన రివాల్వింగ్ ఫండ్ త్వరగా ఖర్చు చేసి వేగంగా పనులను పూర్తి చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో చేపడుతున్న రహదారులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టిసారించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు డి.వి.ఆర్.ఎం రాజు, కె.వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, పంచాయతీ రాజ్ ఈఈ కొండయ్యపడాల్, డీఎల్‌పీవో పి.ఎస్. కుమార్, ఉపాధి ఏపీడీ జె.గిరిబాబు, 11 మండలాల ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మదిని దోచే ప్రకృతి సోయగం



అరకు-విశాఖ ప్రధాన రహదారి బోదగూడ సమీపంలో పొగమంచు అందాలు



పాడేరు-లగిశపల్లి రోడ్డులో..

మన్యం అంటేనే ప్రకృతి అందాలకు నిలయం. ప్రతి రోజూ సరికొత్త అందాలతో ప్రకృతి తన రమణీయతను చాటుకుంటుంది. ఇలాంటి దృశ్యాలే పాడేరు-లగిశపల్లి రోడ్డులో, అనంతగిరి మండలం అరకు-విశాఖ ప్రధాన రోడ్డును ఆనుకుని బోదగూడ సమీపంలో ఆవిష్కృతమయ్యాయి. బోదగూడలో సూర్యోదయం అవుతున్న సమయంలో పొగమంచు అందాలు కొంతసేపు కనువిందుచేశాయి. అటువైపుగా ప్రయాణించిన పర్యాటకులు వాహనాలు నిలిపి, ప్రకృతి అందాలను తిలకించారు. పాడేరు–లగిశపల్లి రోడ్డులో ప్రకృతే బొమ్మగీసినట్టు.. మంచును చీల్చుకుంటూ సూర్యోదయం అవుతున్న అందమైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది.

– అనంతగిరి, పాడేరు

యోగ.. ధ్యానం.. ఆరోగ్యభాగ్యం

ఒకే భూమి.. ఒకే కుటుంబం.. ఒకే భవిత.. అనే నినాదంతో జీ- 20 పగ్గాల్ని చేపట్టిన భారతావని ప్రతిష్టను ఇనుమడింపజేసేలా విశాఖలో రెండో రోజు సదస్సు విజయవంతంగా జరిగింది. బుధవారం ఉదయం ఆరోగ్య సంరక్షణతో మొదలై.. మౌలిక సదుపాయాల కల్పన చర్చతో సదస్సు ముగిసింది. సాగరతీరంలో విదేశీ ప్రతినిధులు యోగాసనాలు వేశారు. మెడిటేషన్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మౌలిక సదుపాయాల కల్పనపై జీ–20 దేశాల ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు.



మౌలిక సదుపాయాల కల్పనపై జరిగిన చర్చలో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

- రెండో రోజు కొనసాగిన జీ–20 సదస్సు
- సాగరతీరంలో విదేశీ ప్రతినిధుల యోగాసనాలు
- మౌలిక సదుపాయాల కల్పనపై విస్తృత చర్చలు
- నేడు సందర్శన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన



యోగాసనాలు వేస్తున్న విదేశీ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : జీ–20 సదస్సు రెండో రోజులో భాగంగా మొదటి సెషన్ సూర్యోదయం సమయంలోనే ప్రారంభమైంది. మెదడు, శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకునేందుకు ప్రతి రోజూ యోగా, ధ్యానం ప్రతి ఒక్కరికీ అవసరమని చాటి చెప్పేందుకు విదేశీ ప్రతినిధులు యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలోని సాగరతీరంలో నిపుణుల పర్యవేక్షణలో విదేశీ ప్రతినిధులు యోగా చేశారు. అనంతరం మెడిటేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా పౌష్టికాహార వినియోగం వల్ల ఆరోగ్యానికి ఒనగూరే ప్రయోజనాలను వారికి నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో 14 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అల్పాహారం అనంతరం మౌలిక సదుపాయాల కల్పన అనే అంశంపై ప్రధాన సమావేశం ప్రారంభమైంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌ల భవిష్యత్‌పై ప్రతినిధులు చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనలో నగరాలను ప్రోత్సహిస్తూ.. వారిని భాగస్వాములు చేయడం, పెట్టుబడులు వచ్చే మార్గాలను మెరుగుపరచడం మొదలైన అంశాలపై దృష్టిసారిస్తూ సుదీర్ఘ చర్చలు జరిగాయి. చివరి సెషన్‌లో అర్బన్ అడ్మినిస్ట్రేషన్‌లో ఫ్రేమ్‌వర్క్‌ను ఎలా అభివృద్ధి చేయాలి, ఇన్‌ఫ్రాట్రాకర్ 2.0ని మెరుగుపరిచే అంశాలపై టెక్నికల్ సెషన్స్ కూడా నిర్వహించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజీ)కి ఆస్ట్రేలియా, బ్రెజిల్ దేశాల ప్రతినిధులు సహ అధ్యక్షులుగా వ్యవహరించి సదస్సును నడిపించారు.



14 దేశాల ప్రతినిధులు

నేడు క్షేత్రస్థాయి పరిశీలన
సదస్సులో మూడో రోజైన గురువారం ఉదయం 10 గంటల నుంచి 1.30 వరకు కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. అనంతరం జీ–20 దేశాల ప్రతినిధుల క్షేత్ర స్థాయి పర్యటనలు ఉంటాయి. ఇందులో భాగంగా ముడసర్లోవ, కాపులుప్పాడ ప్రాంతాల్లో విదేశీయుల పర్యటించనున్నారు. స్మార్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్, మెగా ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, జిందాల్ నిర్వహిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లను సందర్శించనున్నారు. అనంతరం పలు సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

డీపీవో కొండలరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో కొండలరావు

రంపచోడవరం: అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయ స్థాయిలో మరింత మెరుగ్గా, పారదర్శకంగా అమలు చేసేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని డీపీవో కొండలరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ ఏడు మండలాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామసచివాలయాల్లో ప్రభుత్వం కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో రోజూ పారిశుధ్య పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రతి రోజూ 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వి.వి. శ్రీనివాస్, డివిజనల్ అభివృద్ధి అధికారి కోటేశ్వరరావు, ఎంపీడీవో ఎం.వి.ఆర్ కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీపీవో స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య సంపద కేంద్రం నిర్వహణ తీరును వివరించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ ఆసరాతో ఆర్థికాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కొయ్యూరు: ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా సంఘ మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. కొండగోకిరిలో బుధవారం వైఎస్సార్ ఆసరా సమావేశాన్ని మహిళలతో ములిసినాయుడు అధ్యక్షతన నిర్వహించారు.వారు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరాతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గూడెంకొత్తవీధి: గూడెంకాలనీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నీలవరం గ్రామానికి చెందిన వంతలసాయి తమ గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా గూడెంనుంచి చింతపల్లి వైపు వెళుతున్న మరో ద్విచక్రవాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈఘటనలో సాయికి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఆస్పత్రి తరలించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో బైకు అదుపుతప్పి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చింతూరు మండలం తుల సీపాకలు గ్రామానికి చెందిన లక్ష్మణ్ దొర బైకుపై రంపచోడవరం పని నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా మండలంలోని పాములేరు గ్రామం దాటిన తరువాత మలుపు వద్ద వాహనం అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ దొర కాలు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ప్రైవేట్ వాహనంలో రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉక్కు ఉద్యోగి దంపతుల కథ విషాదాంతం

- రాజుపాలెం సమీపంలో మృతదేహాలు లభ్యం
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు


రాజుపాలెం రైల్వే గేటు సమీపంలో వరప్రసాద్, మీరా మృతదేహాలు

కూర్మన్నపాలెం /అనకాపల్లి : మేము వెళ్లిపోతున్నాం అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని అదృశ్యమైన ఉక్కు ఉద్యోగి చిత్రాడ వరప్రసాద్, అతని భార్య మీరా మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. అనకాపల్లి కొప్పాక వద్ద ఉన్న ఏలేరు కాలువ ఒడ్డున వరప్రసాద్, మీరా బైక్, చెప్పులు, బ్యాగు లభించిన చోటుకు రెండు కిలోమీటర్ల దూరంలోని రాజుపాలెం రైల్వేగేటు సమీపంలోని కాలువలో మృతదేహాలు లభ్యమయ్యాయి. గాజువాకలోని వడ్లపూడి తిరుమలనగర్‌కు చెందిన ఉక్కు ఉద్యోగి చిత్రాడ వరప్రసాద్(47) ఉక్కు కర్మాగారంలోని ఎస్ఎంఎస్ – 2 విభాగంలో పనిచేసేవారు. అతనికి 41 ఏళ్ల భార్య మీరా, కుమారుడు కృష్ణసాయితేజ(19), కుమార్తె దివ్యలక్ష్మి (23) ఉన్నారు. కుమార్తె దివ్యలక్ష్మికి గతేడాది వివాహం జరిపారు. కుమారుడు కృష్ణసాయితేజ బ్యాటరీ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలు ఎక్కువై అప్పులు తీర్చలేక తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసుకున్నారు. సెల్ఫీ వీడియో బయటకు రావడంతో వారి కుమారుడు కృష్ణసాయితేజ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తండ్రి వరప్రాద్ ఫోన్ లొకేషన్ ఆధారంగా వెతగ్గా అనకాపల్లి జిల్లా కొప్పాక ఏలేరు కాలువ దగ్గర వరప్రసాద్ ఫోన్, చెప్పులు, హ్యాండ్ బ్యాగు గుర్తించారు. దువ్వాడ ఎస్ఐ కె.దేముడునాయుడు సమాచారంతో అనకాపల్లి గ్రామీణ ఎస్ఐ నరసింగరావు ఐదుగురు గజఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలకు ఎన్టీఆర్ వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోదనలతో మిన్నంటిన తిరుమలనగర్

సెల్ఫీ వీడియో తీసి అదృశ్యమైన దంపతుల మృతదేహాలు లభ్యం కావడంతో తిరుమలనగర్‌లో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేకే తమ తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారని కుమార్తె దివ్యలక్ష్మి వాపోయారు. నిత్యం ఇంటికి వచ్చి దుర్భాషలాడడం, రోడ్డు మీదే పరువు తీస్తామంటూ అసభ్య పదజాలంతో దూషించడంతో తట్టుకోలేకే వారు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

డయేరియా లక్షణాలతో గిరిజనులకు అస్వస్థత

వాంతులు, జ్వరంతో వృద్ధురాలి మృతి


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు సురేంద్ర, తదితరులు


దుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ నడిమివలస లో డయేరియా లక్షణాలతో పలువురు గిరిజనులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. అందిన సమాచారం మేరకు దుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు,వైద్య సిబ్బంది హుటాహుటిన గ్రామానికి వెళ్లి ప్రథమ చికిత్స చేసి, బాధితులను అంబులెన్స్‌లో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అరకులోయ ఆస్పత్రిలో వంతల జయరాం(50),వంతల సుచన(9),వి.కేవిల్(2),వి.ఎలిసా(4),వి.ఇసాక్(9),శ్యాముల్(9)ఇస్మాయిల్(2),వి.యాకోబు(5) చికిత్స పొందుతున్నారు. సమాచారం అందినవెంటనే గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 40 మందికి చికిత్స చేసినట్టు వైద్యాధికారి రాంబాబు తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యం అందజేస్తున్నట్టు ఆయన చెప్పారు.

వృద్ధురాలు మృతి: అదే గ్రామానికి చెందిన పాంగి గున్నమ్మ(70) వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. రెండు రోజుల నుంచి వాంతులు అయ్యాయి. ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. ఆస్పత్రికి కూడా వెళ్లలేదు. మంగళవారం రాత్రి వాంతులు ఎక్కువ అవడంతో వైద్య సిబ్బంది చికిత్స అందజేసి, అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. అరకులోయ ఆస్పత్రికి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర,రామారావులు వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

అత్యంత సుందర నగరం విశాఖ

- కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు
- ఘనంగా ఐఐఎం 7వ స్నాతకోత్సవం
- విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీల ప్రదానం


తల్లిదండ్రులతో ఆనందం పంచుకుంటున్న గోల్డ్ మెడల్ విజేత


విద్యార్థికి బంగారు పతకం, డిగ్రీ ప్రదానం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు

ఏయూక్యాంపస్: అత్యంత సుందర నగరాల్లో ఒకటిగా విశాఖ నిలుస్తుందని కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. ఇటువంటి నగరంలో ఉండి పనిచేసే అద్భుత అవకాశం తనకు రాలేదని చెప్పారు. బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో బుధవారం ఐఐఎం విశాఖపట్నం 7వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విశాఖ లాంటి బ్యూటిఫుల్ సిటీలో ఉన్న ఐఐఎంలో చదువుకోవడం మీ అందరికీ లభించిన మంచి అవకాశమన్నారు. తనకు ఐఐఎంలో చదువుకునే అవకాశం రాలేదని, అతిథిగా మాత్రమే వెళ్లగలిగానని గుర్తుచేసుకున్నారు. ఇక్కడ గోల్డ్ మెడల్స్ సాధించిన ప్రతి విద్యార్థికి కేవలం పూత పూసినవి ఇవ్వలేదని, స్వచ్ఛమైన మేలిమి బంగారంతో తయారు చేసి అందించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులంతా మేలిమి బంగారం మెరిసినట్లు.. ఎంచుకున్న రంగంలో అద్వితీయ ప్రగతి, పరిణితి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలను సురేష్ ప్రభు ప్రదానం చేశారు. 2020–2022 బ్యాచ్‌కు చెందిన 239 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొందారు.

గోల్డ్ మెడల్ విజేతలు వీరే..

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం(పీజీపీ) విభాగంలో ఆయాన్ వర్మ, ప్రాప్తి ఆలోక్.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఫర్ ఎక్స్‌పీరియన్స్‌డ్ ప్రొఫెషనల్స్(పీజీపీఎక్స్) విభాగంలో కునాల్ రంజన్, తన్మయ గుప్త.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్(పీజీపీడీజీఎం) విభాగంలో మిన్హాజ్ అహ్మద్, ఆశిం చాబ్లాలు బంగారు పతకాలను సాధించారు. వీరిలో ఆయాన్‌వర్మ, ప్రాప్తి ఆలోక్‌లు రెండేసి గోల్డ్ మెడల్స్ పొందారు.

ఫ్యాకల్టీ సహకారం బాగుంది



కోవిడ్ సమయంలో ప్రవేశం పొందిన మేము ఫ్యాకల్టీ సహకారం, మార్గదర్శకంతో విజయవంతంగా కోర్సు పూర్తి చేసాం. విశాఖ నగరం చాలా బాగుంది. కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగం సాధించాను. ఉత్తర ప్రదేశ్‌లోని గజియాబాద్ నుంచి వచ్చాను.

– ప్రాప్తి ఆలోక్, పీజీపీ విద్యార్థిని

అన్ని విభాగాల్లో ప్రోత్సహించారు



ప్రారంభంలో తరగతులు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. అనంతరం ఏయూలోని ఐఐఎం క్యాంపస్‌లో తరగతులు జరిపారు. అకడమిక్, స్పోర్ట్స్ వంటి అన్ని విభాగాల్లో ప్రోత్సహించిన విధానం బాగుంది. అమెజాన్ సంస్థలో ఉద్యోగం పొందాను.

– ఆయాన్ వర్మ, పీజీపీ స్టూడెంట్

ఐఐఎం ఫ్యాకల్టీ అద్భుతం



ఐఐఎం విశాఖపట్నం అద్భుతమైన ఫ్యాకల్టీని కలగి ఉంది. విజిటింగ్ ఫ్యాకల్టీ కూడా నిష్ణాతులే కావడం మా అదృష్టంగా భావిస్తున్నాం. అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో ఐఐఎం విద్యను అందిస్తోంది.

– మిన్హాజ్ అహ్మద్, పీజీపీడీజీఎం విద్యార్థి

వైద్య శిబిరాలు నిర్వహించాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


కంటి పరీక్షలు చేయించుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: అరకులోయ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోను నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విశాఖలోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యులను కోరారు. ఆయన ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. గిరిజన విభాగం వార్డును తనిఖీ చేశారు. శస్త్రచికిత్సలు జరుపుకుని కోలుకుంటున్న గిరిజనులను పరామర్శించారు.వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కూడా కంటి పరీక్షలు జరుపుకున్నారు.ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రతో సమీక్షించారు. ప్రాంతీయ ఆస్పత్రిలో కంటి వైద్యం,శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేసారు.ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు అరకులోయలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని,తేదిలు ఖరారు చేయాలని ఆస్పత్రి సూపరిండెంట్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అరకులోయ సచివాలయాల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

చింతరేగుపల్లి గ్రామసభలో 73 అభ్యంతరాలు


గ్రామ సభలో అర్హుల జాబితాను వెల్లడిస్తున్న తహసీల్దార్ శ్రీధర్

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామం చింతరేగుపల్లిలో బుధవారం నిర్వహించిన ఆర్ అండ్‌ఆర్ గ్రామ సభలో ఆధార్, బ్యాంకుఖాతా, రేషన్ కార్డు తదితరాలపై 73 అభ్యంతరాలు వచ్చినట్టు స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) లక్ష్మీపతి తెలిపారు. ఎస్ఈఎస్ ప్రకారం గ్రామంలో మొత్తం 439 నిర్వాసిత కుటుంబాలను గుర్తించినట్టు ఆయన చెప్పారు. అనంతరం తహసీల్దార్ ఎస్.శ్రీధర్ అర్హుల జాబితాను చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు,జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి ,ఎంపీపీ కారం లక్ష్మి, ఈవోపీఆర్‌డీ పి.వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులను తరలించేందుకు రెండు బోట్లకు అనుమతి

వీఆర్‌పురం: మండల పరిధి శ్రీరామగిరిలోని సీతారామచంద్రస్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు గోదావరి ఆవలి ఒడ్డు వెలేరుపాడు మండలం నుంచి తరలి వచ్చే భక్తుల కోసం రెండు బోట్లను ఏర్పాటు చేశామని, వాటికి ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక అనుమతులు లభించాయని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ నెల 30,31 తేదీల్లో భక్తులను తరలించేందుకు గాను సాయి గాయత్రీ, కుమారిదుర్గ బోట్లకు అనుమతులు మంజూరైనట్టు తహసీల్దార్ తెలిపారు.

గంజాయి తరలింపుపై గట్టి నిఘా


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

కె.కోటపాడు: జిల్లాలో గంజాయి తరలింపుపై గట్టి నిఘా పెట్టినట్లు ఎస్పీ గౌతమి సాలి అన్నారు. మండలంలో గల ఎ.కోడూరు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులతో పాటు కేసుల్లో పట్టుబడిన సామగ్రిని భద్రపరిచే ఈ–మక్కాన్ గదిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతు గంజాయి తరలించే వ్యక్తులను గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ కేసుల్లో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. మొదటి విడతగా 37 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న చోట్ల రెవెన్యూ సిబ్బందితో వాహనదారులు జాగ్రత్తలు పాటించేటట్లు చర్యలు తీసుకున్నట్లు ఆమె వివరించారు. గతంలో కంటే రోడ్డు ప్రమాదాల్లో చనిపోయే వారి శాతం జిల్లాలో తగ్గిందని అన్నారు. గ్రామాల్లో పోలీస్ శాఖ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ గౌతమి సాలి తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పచ్చదనంతో నిండి ఉండడంతో సిబ్బందిని ఆమె అభినందిచారు.

కటాఫ్ తేదీ ప్రామాణికంగా పరిహారం

చింతూరు: కటాఫ్ తేదీ ప్రామాణికంగా పోలవరం పరిహారం వర్తిస్తుందని చింతూరు ఎంపీడీవో రవిబాబు అన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ 10–10–2022 కటాఫ్ తేదీగా నిర్ణయించినట్టు చెప్పారు. చింతూరులో బుధవారం నిర్వహించిన పోలవరం నిర్వాసితుల గ్రామసభలో ఆయన మాట్లాడారు. కుటుంబ సర్వేలో చిన్న పిల్లల పేర్లు చేర్చడంపై నిర్వాసితుల్లో అపోహలు ఉన్నాయని, ఏదైనా కుటుంబంలో తల్లిదండ్రులు చనిపోతే వారికి నామినీగా ఉన్న పిల్లలకు పరిహారం అందించేందుకే జాబితాలో పిల్లల పేర్లు చేర్చినట్టు చెప్పారు. పోలవరం నిర్వాసిత గిరిజనులకు ఎటపాక మండలంలో ఐదు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు సమీపంలోనే వ్యవసాయ భూమి ఇస్తారని ఆయన తెలిపారు. గిరిజనేతరులకు ఏలూరు జిల్లా తాడ్వాయిలో స్థలం, ఇల్లు ఇస్తారని, వాటిని వద్దనుకుంటే నగదు అందచేయనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ప్రస్తుతం వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తున్నారని, వాటిని ఆర్‌అండ్‌ఆర్ సిబ్బంది సరిచేసి తుది జాబితా విడుదల చేస్తారని చెప్పారు. దీనిపై మళ్లీ గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. బుధవారం నిర్వహించిన గ్రామసభలో 4,5,6,12,14,15,21 క్లస్టర్ల పరిధిలోని కుటుంబాల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్ బాబు, తహసీల్దార్ సాయికృష్ణ, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు: పోలవరం పరిహారం రెండో దశలో ఉన్న చింతూరును 2022 గోదావరి వరదల ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి తొలిదశ(41.15 కాంటూరు లెవల్)లో కలిపారు. సామాజిక ఆర్థిక సర్వే ఆధారంగా చింతూరులో 1918 కుటుంబాలను అర్హులుగా తేల్చిన అధికారులు వలంటీర్లతో ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం క్లస్టర్ల వారీగా మూడురోజుల పాటు గ్రామసభలు నిర్వహించి వలంటీర్లు సేకరించిన కుటుంబాల వివరాలను వెల్లడించారు. కుటుంబ వివరాలు, డాక్యుమెంట్ల వివరాల్లో ఏమైనా తేడాలుంటే వారినుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

అప్పన్న కల్యాణోత్సవానికి కానుకగా పట్టువస్త్రాలు

సింహాచలం: సింహగిరిపై వచ్చేనెల 2న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చెన్నైకి చెందిన వెంకటరమణ 1.70 లక్షలు, డి.అప్పారావు 1.41 లక్షలు, ఎస్.కె.మూర్తి 1.40 లక్షల విలువ చేసే పట్టువస్త్రాలను కానుకగా అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో నరసింహరాజు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావుకి వీటిని అందజేశారు. అలాగే నగరంలోని గోపాలపట్నానికి చెందిన స్వర్ణ జ్యూయలర్స్ ప్రతినిధులు కేజీ ముత్యాల తలంబ్రాలను కానుకగా అందించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి వీటిని అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్ రాజ్, ఏఈ హరి పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.74 లక్షలు

వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం లెక్కింపు రెండవ రోజైన బుధవారం కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో రూ.74,01,967 ఆదాయం లభించినట్టు దేవస్థానం ఈవో త్రినాథరావు తెలిపారు. నగదుతో పాటు 56 గ్రాముల బంగారం, 5.650 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. రెండు రోజులపాటు లెక్కించిన హుండీల ద్వారా 41రోజులకు గానూ రూ.2,80,13,177 ఆదాయం లభించినట్టు తెలిపారు.

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

హుకుంపేట: బోయ వాల్మికులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ దండకారుణ విమోచన సమితి(డీఎల్‌వో) వ్యవస్థాపకులు చెండా ఏలియా తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేరిస్తే అర్హులైన గిరిజనులందరూ నష్టపోయే అవకాశం ఉందన్నారు. తడిగిరి సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారదాపీఠాధిపతులకు ఆహ్వానం


స్వరూపానందేంద్ర సరస్వతితో మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై వచ్చే నెల 2న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం, 23న జరిగే చందనోత్సవాలకు హాజరు కావాలని శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలకు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆహ్వానించారు. శారదా పీఠంలో స్వరూపానందేంద్ర సరస్వతిని ఈవో బుధవారం కలిశారు. స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, చందనోత్సవానికి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఈవో స్వామీజీకి వివరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం మెరుగైన ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలం కావడంతో భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఈవోకు స్వామీజీ సూచించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈవో వెంట ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డు పనులు


రోడ్డు పనులు చేస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: అంతాడ పంచాయతీ గంపరాయికి చెందిన గిరిజనులు తమ గ్రామానికి రహదారిని శ్రమదానంతో నిర్మించుకున్నారు. రంపుల సమీపంలో కొక్కితపాడు నుంచి నిమ్మలగొంధి వెళ్లే దారిలో గంపరాయి ఉంది. గ్రామానికి అసలు రోడ్డు లేదు. దీంతో గ్రామానికి అవసరమైన రహదారిని స్థానికులంతా ఏకమై శ్రమదానంతో ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వతంగా రహదారి నిర్మించాలని కోరారు.

నేడు మంత్రి మేరుగ నాగార్జున పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. హోటల్ దసపల్లాలో బస చేస్తున్న మంత్రి ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం కొక్కిరాపల్లికి వెళ్లి.. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సందర్శిస్తారు. అనంతరం నక్కపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ భూమి తనిఖీ చేస్తారు. అక్కడ నుంచి తిరిగి దసపల్లాకు చేరుకుని బస చేస్తారు. 31న ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని అక్కడ నుంచి ఆనందపురం మండలం వెళతారు. అక్కడ పౌల్ట్రీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తారు. అక్కడ నుంచి దేవరాపల్లి వెళతారు. ఆనందపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు.

దేవరాపల్లి నుంచి కొత్తవలస బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు కొత్తవలస షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి పరిశీలిస్తారు. అనంతరం శ్రీకృష్ణాపురంలో ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిశీలిస్తారు. రాత్రికి గరీభ్‌రథ్ రైలులో మంత్రి గుంటూరు వెళతారు.